RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

# అన్వేష నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 158 | మంగళవారం20 అక్టోబర్ 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## భూ వివాదాల శాశ్వత పరిష్కారమే

# ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట
- 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ
- భూ భారతి చట్టం తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలు పంపిణీ
- పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ - సర్వేతో పరిష్కారం
- సాగుదారులను గుర్తించి చట్టబద్ధమైన భూ హక్కుల కల్పన
- తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు వివరించారు.

2 లో..



పాఠకులు,
ప్రచురణకర్తలు, మిత్రులు,
శ్రేయోభిలాషులకు
విజయదశమి పర్వదిన
శుభాకాంక్షలు ..
విజయదశమి పర్వదినాన్ని
పురస్కరించుకొని రేపు
మా కార్యాలయానికి సెలవు..
పునర్దర్శనం..గురువారం



గోళ్ళ రమేష్
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్



'ఎవరినీ వదిలిపెట్టం'.. టైగర్

## ష్రాఫ్‌పై కాల్పుల నేపథ్యంలో సీఎం ఫడ్నవీస్ వార్నింగ్

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైన గ్యాంగ్, వ్యక్తులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఇప్పటికే కొందరు అనుమానితులను పోలీసులు గుర్తించారని సీఎం వెల్లడించారు. నిందితులు ఎక్కడ దాక్కున్నా పోలీసులు వారిని పట్టుకుంటారని ఫడ్నవీస్ స్పష్టం చేశారు.



## నేహాబోరాకు ఢిల్లీ పోలీసుల నోటీసులు.. హైకోర్టును ఆశ్రయించిన ఏఐఎస్ఏ అధ్యక్షురాలు

ఢిల్లీ పోలీసులు తనకు జారీచేసిన నోటీసులను వెంటనే నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా. ఈ నోటీసులు వెనక్కి తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## భారత్.. ఫ్రాన్స్ కాదు, బంగ్లాదేశ్ కాదు.. 'పాలకవర్గ మార్పు' ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్



ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, అల్లర్లతో భారతదేశంలోని పరిస్థితులను పోల్చడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక నిఘా సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాల నిరసనల నేపథ్యాన్ని ఈ ఘటనలతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేసింది.



## హైదరాబాద్‌లో విషాదం.. షేర్ మార్కెట్ నష్టాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

## 'నవంబర్‌లోగా కాఫర్ డ్యాం నిర్మించాలి'.. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కవిత డిమాండ్



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సందర్శించారు. కన్నెపల్లి పంప్ హౌజ్ వ్యూ పాయింట్ నుంచి గోదావరి ప్రవాహన్ని పరిశీలించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నెలకొన్న నీటి సమస్యను పరిశీలించేందుకు కవిత పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్

పాతబస్తీ మదీనా ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.



హైకోర్టుకు ఎదురుగా మదీనా క్రాస్ రోడ్ వద్ద ఉన్న బాంబే హోజరీ వస్త్ర దుకాణం, గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది. భవనంలోని రెండో అంతస్తులో మంటలు భారీగా చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది,ం చార్మినార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. హోల్ సేల్ క్లాత్ మార్కెట్ కావడంతో భారీ ఎత్తున నష్టం ఉండే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

## 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

**గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన**

**సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య**

**వర్షాలు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం**

**గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు**

**దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం**

**భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన**

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.



## మెడికవర్ ఆసుపత్రితో నీకు సంబంధం లేకపోతే సీబీఐ విచారణకు ఆదేశించు రేవంత్ రెడ్డి

**బీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్‌**

హైదరాబాద్

మెడికవర్ ఆసుపత్రి, నైమిషా రెడ్డి నిర్మిస్తున్న ప్రైవేట్ స్కూల్స్, కొండల్ రెడ్డి 'టెస్సరాక్ట్', స్వచ్ఛ్ బయో, మాక్స్ బిన్ ఫార్మా, గీతా హ్యుండాయ్ కంపెనీలతో సంబంధం లేకపోతే.. సీబీఐ విచారణకు ఆదేశించాలని రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి ఒక ఆధారమైనా చూపించండి అంటే మూడు ఆధారాలు చూపించాము, ఇంత వరకు సమాధానం లేదు . సీబీఐ విచారణకు ఆదేశిస్తే అన్ని ఆధారాలు సమర్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు. చేవెళ్ల చందనవల్లిలోని సర్వే నం.363లో భూములన్ని నిషేధిత జాబితాలో ఉన్నాయి. కానీ.. 363/3 ఒక్కటే రిజిస్ట్రేషన్ చేయించబడింది. ఆర్ 9 కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన శ్రీకాంత్ రెడ్డి కూతురి పేరుపై ఆ భూమిని రిజిస్ట్రేషన్స్ చేయించబడింది. అసలు ఈ ఆర్ 9 కన్‌స్ట్రక్షన్స్ ఎవరిది? అని ఆరా తీస్తే.. అది సీఎం సోదరుడు అనుమల కృష్ణా రెడ్డిది అని తేలింది. ఈ కంపెనీ మంచిరేవులలో 75 కోట్ల విల్లాలో ఉందని క్రిశాంక్ వెల్లడించారు. 22ం తీసుకొచ్చింది ఇలాంటి భూములను కొల్లగొట్టడానికే, ఇలాంటి కుంభకోణాలు చేయడం వల్లనే రూ.50,000 కోట్లు దోచుకున్నారు ఎమ్మెల్యేకు ఫండ్ కావాలంటే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవాలని అనుముల కృష్ణారెడ్డి బెదిరించినట్టు పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పాడు. చందన్‌వల్లి గ్రామంలోని 363 సర్వే నంబర్‌లో ఉన్న నిషేధిత భూమిలో 363/3 భూమిని ఇటీవలే రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.

# భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట**

**12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ**

**భూ భారతి చట్టం తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలు పంపిణీ**

**పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ - సర్వేతో పరిష్కారం**

**సాగుదారులను గుర్తించి చట్టబద్ధమైన భూ హక్కుల కల్పన**

**తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




హైదరాబాద్,

రాష్ట్రంలో భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ – సర్వేతో పరిష్కారమని పేర్కొన్నారు. సాగుదారులను గుర్తించి చట్టబద్ధమైన భూ హక్కుల కల్పన చేస్తున్నామని అన్నారు. నారాయణ పురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూహక్కులు కల్పించామని సోదాహరణంగా వివరించారు. సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించామని తెలిపారు. పాస్ పుస్తకాలతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా సహా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రీ–సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. భూ హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

## 'ఎవరినీ వదిలిపెట్టం'.. టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల నేపథ్యంలో సీఎం ఫడ్నవీస్ వార్నింగ్

ముంబై:

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైన గ్యాంగ్, వ్యక్తులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఇప్పటికే కొందరు అనుమానితులను పోలీసులు గుర్తించారని సీఎం వెల్లడించారు. నిందితులు ఎక్కడ దాక్కున్నా పోలీసులు వారిని పట్టుకుంటారని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులతో కార్యకలాపాలు సాగించాలని ఎవరైనా ప్రయత్నిస్తే, వారిని ఎలా కట్టడి చేయాలో ముంబై పోలీసులకు బాగా తెలుసని సీఎం అన్నారు. ఈ ఘటనపై విలేకరుల సమావేశంలో సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ.. దర్యాప్తులో పోలీసులకు కొన్ని కీలక ఆధారాలు లభించాయని, వాటి ఆధారంగా నిర్దిష్ట వ్యక్తులను గుర్తించామని చెప్పారు. వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన వారితో పాటు తెర వెనుక ఉండి ఆదేశాలిస్తున్న సూత్రధారులను కూడా పట్టుకుంటామని తెలిపారు. లారెన్స్ బిష్ణోయ్‌ను కస్టడీలోకి తీసుకునే ప్రయత్నాలపై స్పందిస్తూ.. ఇప్పటికే కేంద్రానికి అభ్యర్థన పంపించామని, చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతోందని ఫడ్నవీస్ చెప్పారు. సూత్రధారులు ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వారిని పట్టుకుంటామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఉండి కార్యకలాపాలు సాగిస్తున్న వారిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉంటూ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. విదేశాల్లో ఉన్నవారిని పట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామని సీఎం తెలిపారు. ఇదే సమయంలో నటీనటుల భద్రతపై స్పందించిన సీఎం ఫడ్నవీస్.. కాల్పుల ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను విశ్లేషిస్తామన్నారు. నటీనటుల భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం చెప్పారు.

## నేహాబోరాకు ఢిల్లీ పోలీసుల నోటీసులు.. హైకోర్టును ఆశ్రయించిన ఏఐఎస్‌ఏ అధ్యక్షురాలు

ఢిల్లీ,

ఢిల్లీ పోలీసులు తనకు జారీచేసిన నోటీసులను వెంటనే నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఏఐఎస్‌ఏ) అధ్యక్షురాలు నేహా బోరా. ఈ నోటీసులు వెనక్కి తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన వ్యాజ్యంపై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారామె. పోలీసుల నోటీసులు అస్పష్టంగా ఉన్నాయని ఆమె విమర్శించారు. అంతేకాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21లను అతిక్రమిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఏఐఎస్‌ఏ ఓ ప్రకటన విడుదల చేసింది. బీఎన్ఎస్ఎస్ చట్టంలోని 126, 130 సెక్షన్ల కింద ఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు కావాలని నేహా బోరాను ఢిల్లీ పోలీసులు ఆదేశించారు. విచారణ సమయంలో శాంతి భద్రతలను కాపాడాలని ఆమెకు పోలీసులు స్పష్టం చేశారు. అందుకోసం వ్యక్తిగత పూచికత్తుతోపాటు రూ.10 వేల బాండ్‌పై సంతకం చేయాలని కూడా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేహా బోరా.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమె తరఫు న్యాయవాదుల బృందం ఈ రోజు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.మరో వైపు అక్టోబర్ 16న పోలీసుల నిర్బంధం నుంచి నేహా బోరా విడుదలయ్యారని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ తెలిపింది. నాటి నుంచి ఆమెను పోలీసులు మఫ్టీలో అనుసరిస్తున్నారని విమర్శించింది. ఇది పోలీసుల నియమావళిలో భాగమా? లేకపోతే ఆమెను భయపెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నమా? అని సందేహం వ్యక్తం చేసింది.

## భారత్.. ఫ్రాన్స్ కాదు, బంగ్లాదేశ కాదు.. 'పాలకవర్గ మార్పు' ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్

ఫ్రాన్స్,

బంగ్లాదేశ్‌లలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, అల్లర్లతో భారతదేశంలోని పరిస్థితులను పోల్చడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక నిఘా సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాల నిరసనల నేపథ్యాన్ని ఈ ఘటనలతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేసింది.

### శశి థరూర్ స్పష్టత

భారతదేశం.. బంగ్లాదేశ్ లేదా ఫ్రాన్స్ కాదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పష్టం చేశారు. 'మేం ఎలాంటి హింసను లేదా బస్సులకు, పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టే చర్యలను ఎప్పుడూ ప్రోత్సహించం. రాజ్యాంగబద్ధమైన, శాంతియుత నిరసనలను మాత్రమే విశ్వసిస్తాం' అని ఆయన అన్నారు.ప్రభుత్వాన్ని కూల్చే లేదా మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలను ఆయన తప్పుపట్టారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజల పేర్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారనే ఆందోళనతోనే నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

### పవన్ ఖేరా వ్యాఖ్యలు

భారత్‌లోని పరిణామాలను ఐరోపా దేశాలతో పోల్చడం ఆపిల్ పండ్లను ఆరంజ్ పండ్లతో పోల్చడమే అవుతుందని రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా మండిపడ్డారు. ఐరోపాలో నిరసనకారులే అల్లర్లకు దిగుతుంటే, భారత్‌లో మాత్రం ప్రభుత్వాలే శాంతియుతంగా నిరసనలు తెలిపే ప్రజలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయని ఆరోపించారు.

### కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపణలు

ఈ వివాదంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, బంగ్లాదేశ్, ఫ్రాన్స్‌ల తరహాలోనే భారతదేశంలో కూడా వీధుల్లో హింసను ప్రేరేపించేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. భారత్‌లో పాలకవర్గ మార్పు అనేది ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, కుట్రలు లేదా విదేశీ శక్తుల వల్ల కాదని వ్యాఖ్యానించారు.



## 'నవంబర్‌లోగా కాఫర్ డ్యాం నిర్మించాలి'.. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కవిత డిమాండ్

జయశంకర్ భూపాలపల్లి,

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సందర్శించారు. కన్నెపల్లి పంప్ హౌజ్ వ్యూ పాయింట్ నుంచి గోదావరి ప్రవాహన్ని పరిశీలించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నెలకొన్న నీటి సమస్యను పరిశీలించేందుకు కవిత పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్ చేశారు. నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాంను నిర్మించకుంటే కన్నెపల్లి పంపు హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దని కవిత అన్నారు. ప్రశ్నించి, పోరాడటమే కాకుండా ప్రభుత్వానికి పరిష్కార మార్గాలను చెబుతున్నామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధితో తాము ఇక్కడ వరకు వచ్చామని తెలిపారు. ఏదో రాజకీయాలు చేస్తూ టీవీల్లో కనిపించాలనే ఉద్దేశం ఉన్న పార్టీ టీఆర్ఎస్ కాదని.. తాము చేసిన సూచనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని రైతులకు మేలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో విషాదం.. షేర్ మార్కెట్ నష్టాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్,

నగరంలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. 34 ఏళ్ల తమ్మిశెట్టి ప్రవీణ్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ప్రవీణ్‌కు మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ప్రవీణ్.. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాడు. అయితే అందులో నష్టపోయిన అతడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు, బంధువుల ముందు పరువుపోతుందేమే అన్న భయంతో కఠిన నిర్ణయం తీసుకున్నాడు. చైతన్యపురిలోని ఓ భవనం పై నుంచి దూకేశాడు.తీవ్రంగా గాయపడిన అతడు.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న వెంటనే చైతన్యపురి పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రవీణ్ మృతిసమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ మృతి విషయం తెలిసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ పరిశ్రమ పూజారి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శారద కృష్ణ (60) గత కొన్నేళ్లుగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం గ్రామ పరిధిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పరిశ్రమ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. ?సోమవారం ఉదయం శారద కృష్ణ తన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనంపై మేడ్చల్ వైపు వస్తుండగా డబీల్‌పూర్ చౌరస్తా సమీపంలోని పంజాబీ దాబా వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. ?సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

**గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన**

**సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య**

**వర్షాలు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం**

**గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు**

**దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం**

**భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన**

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## మంచిర్యాల కాంగ్రెస్ లో గ్రూపు ఘర్షణలు

మంచిర్యాల

సద్దుల బతుకమ్మ వేళ.. స్థానిక కాంగ్రెస్ నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్ళపేట గ్రామంలో ఘటన జరిగింది. గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతుండగా కాంగ్రెస్ గ్రూపుల మధ్య ఘర్షణ చెలరేగింది. ప్రేమ్ సాగర్ రావు, జగన్ మోహన్ రావు వర్గాల మధ్య వివాదం నెలకొంది. మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకోవడంతో ఇరువర్గాలు కొట్టుకున్నాయి. ఈ కొట్లాటలో పలువురు మహిళలకు కుడా గాయాలు అయ్యాయి. వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు.

## ఎండిపోతున్న పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్

కృష్ణానదిలో నీళ్లున్నా, పంపులు సిద్ధంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. సోమ వారం నాడు అయన ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. పెంట్లవెల్లి మండలం గోప్లాపూర్, సింగవరం, చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి, పెద్దదగడ గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సొంత నియోజకవర్గంలోనే రైతుల పంటలు ఎండిపోతుంటే మంత్రి జూపల్లి కృష్ణారావు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

### జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్

### 500లకే గంటపాటు శిక్షణ

**ఇస్లామాబాద్,**

పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఏర్పాటు చేసిన ఉగ్రవాద గ్రూప్ చురుకుగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనికి మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ సంస్థ ప్రకటించుకుంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్–ముమినాత్'పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించి నట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం. ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానసిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్–ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్–ఓ–అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఐఎస్ఐఎస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడులు నిర్వహించడానికి ఈ మహిళలతో ఉగ్రవాద బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.

# బంగారం, వెండి ధరల్లో దూకుడు

### గరిష్టస్థాయికి చేరుకున్న ధరల పెరుగుదల

### బంగారంతో పోటీ పడుతున్న వెండి ధరలు

**న్యూఢిల్లీ**

దేశంలో పసిడి ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం కాస్తంత తగ్గిన ధరలు మళ్లీ విజృంభించాయి. వెండి ధర కూడా రికార్డు స్థాయికి చేరింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తున్న వైనం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతపై అంతకంతకూ పెరుగుతున్న ఆశలు గోల్డ్‌కు డిమాండ్ మరింతగా పెరిగేలా చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, భారత్‌లో గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర





రూ. 1,30,590గా ఉంది. నిన్నటి రేట్‌తో పోలిస్తే ఇది రూ.720 అధికం. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ రేట్ కూడా రూ. 650 మేర పెరిగి రూ.1,19,710కు చేరుకుంది. ఇక పారిశ్రామిక డిమాండ్ అధికంగా ఉండటంతో వెండి ధరలూ రికార్డు స్థాయిని తాకాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1,91,100 వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఏడాదిలో ఇప్పటివరకూ బంగారం ధరలు 40 శాతం మేర పెరిగాయని పరిశీలకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది కూడా గోల్డ్ రేట్స్‌లో జోరు కొనసాగుతుందని గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్ తాజా నివేదికలో తేలింది. కేంద్ర బ్యాంకులు భారీగా పసిడి కొనుగోళ్లకు దిగడం, నెమ్మదిస్తున్న అమెరికా ఆర్థిక వృద్ధి, బలహీనపడుతున్న డాలర్ వంటివి పుత్తడికి డిమాండ్ పెంచుతున్నాయి. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా కొత్త వ్యక్తిని ఎంపిక చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో వడ్డీ రేట్ కోతపై ఆశలు మరింత పెరిగాయి. ఫలితంగా బంగారం ధరలు మరింత ఎగబాకాయి. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాల నుంచి డిమాండ్ విపరీతంగా ఉండటం, సరఫరాలో తగ్గుదల వెరసి వెండి ధర ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకేలా చేశాయి. గతేడాదితో ధరలతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధర ఇప్పటివరకూ సుమారు 101 శాతం మేర పెరిగింది.

# పవన్ వ్యాఖ్యలను వక్రీకరించడం తగదు

### జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం

ధర్మవరం, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ మాటలను వక్రీకరించి ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మంచిదికాదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు రెండు తెలుగురాష్ట్రాలు సమానమే అన్నారు. ఆయన ఎప్పుడూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధిని కోరుకుంటారన్నారు. కోనసీమ ఎప్పుడూ పచ్చదనంతో ఉండేది, ఈ పచ్చదనం గురించి ఆంధ్ర, తెలంగాణ ప్రజలు చర్చించుకునే వారు అన్నారే కానీ ఎక్కడా తెలంగాణ ప్రజల వల్ల అన్యాయం జరిగిందని అనలేదన్నారు. దీనిని వక్రీకరించడం భావ్యం కాదన్నారు. అదేవిధంగా పేర్నినాని లాంటి వాళ్లు తిన్నింటి వాసాలు లెక్కపెడతారని గ్రహించిన ఆంధ్ర ప్రజలు ఆయనకు, ఆయన పార్టీకి గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా జ్ఞానోదయం కాలేదని మండిపడ్డారు. త్వరలో వైసీపీకి గోరీ కట్టే రోజు దగ్గరలోనే ఉందని ఆయన అన్నారు

# కాకినాడలో గంజాయి దందా

### ఇటీవలి కేసులతో ప్రజల్లో ఆందోళన

**కాకినాడ,**

కాకినాడలో గంజాయి కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. 2023 ఆగస్టు 16న గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో హల్‌చల్ చేశారు. ఓపి లేకుండా వైద్యం ఎందుకు చేయరంటూ సిబ్బందిపై దాడి చేశారు. అవుట్ పోస్ట్ పోలీసులు వారిని అదుపు చేసే ప్రయత్నం చేసినా ఆగలేదు. చివరికి సోదా చేయగా వారి వద్ద కత్తులు, గంజాయి బయటపడడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ ఏడాది జూన్‌లో పెద్దాపురంలో జరిగిన మరిడమ్మ జాతరలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. జాతర సందర్భంగా డ్యాన్స్ ప్రోగ్రాంను నిర్వహించగా అక్కడికి వచ్చిన కొందరు గంజాయి, మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరుగ్రూపులూ రక్తం కారేలా కొట్టుకున్నాయి. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ



ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు జిల్లాలో వివిధ స్టేషన్ల పరిధిలో 41 గంజాయి కేసులు నమోదయ్యాయని జిల్లా పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిని, కొనుగోలు చేసేవారిని, మధ్యవర్తులను గుర్తించి 140 మందిని అరెస్టు చేశామని చెప్పారు వీరి నుంచి 34 వాహనాలను సీజ్ చేశామని, సుమారు రూ.1.25 కోట్ల విలువైన 2,163 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 2022 నుంచి జిల్లాలో 21 పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడ్డ సుమారు రూ.4 కోట్ల విలువైన గంజాయిని ఇటీవల ఎస్‌పి జి.బిందు మాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. 8,274.45 కిలోల డ్రై గంజాయి, 555 గ్రాముల లిక్విడ్ గంజాయి, 15 ఎండిఎంఎ మాత్రలను జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ నిర్వీర్యం చేసింది. ఈ ఏడాది నమోదైన కేసుల్లో కొన్ని .. ఈ ఏడాది జూన్‌లో కాకినాడ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ÷ఎలైలో కాకినాడ మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేజీల గంజాయిని విక్రయించేందుకు వీలుగా చిన్నచిన్న పొట్లాలు చుడుతుండగా పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసికోర్టుకు తరలించారు. సెప్టెంబర్ ఆరున తుని పట్టణం సీతారామపురం జంక్షన్ వద్ద అప్పుడే బస్సు దిగి అనుమానాస్పదంగా సంచరిస్తున్న కాకినాడకు చెందిన మీసాల షణ్ముఖ, జగడం చైతన్య సిద్ధార్థ, జగన్నాథం, పెద్దిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని సోదా చేయగా గంజాయి బయటపడింది.

# సాధారణ స్థితికి చేరుకుంటున్నాం

### విమానాల అంతరాయాన్ని సరిదిద్దుతున్నాం

### ఇండిగో విమానయాన సంస్థ తాజా ప్రకటన

**న్యూఢిల్లీ,**

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణ సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతున్నది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ ప్రకటించింది. అంతేకాదు, కేవలం గడిచిన రెండు రోజుల వ్యవధిలోనే వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది. ఢిల్లీ, ముంబై,హైదరాబాద్ సహా ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సంక్షోభం తలెత్తింది. మరోవైపు విమానాల రద్దు, ఆలస్యంపై ఇండిగో సంస్థ స్పందించింది. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించ నున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఈ మేరకు గురువారం ఉదయం ప్రకటన విడుదల చేసింది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఏకంగా 250 నుంచి 300 విమానాలను సంస్థ రద్దు చేసింది. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో సంక్షోభం ఏర్పడింది. విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఎయిర్‌పోర్ట్స్ వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. విమానాలు రద్దు కావడంతో ప్రముఖ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది. అదే సమయంలో తాజా పరిస్థితిపై ప్రయాణికులు నిరాశను వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దఅశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ప్రధాని నరేంద్ర మోడీ, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ట్యాగ్ చేస్తూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 7 గంటలకు పైగా చిక్కుకుపోయిన ఓ ప్రయాణికుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళం తలెత్తినట్లు ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు 12 గంటలకు పైగా ఎటువంటి కన్ఫర్మేషన్ లేకుండా పడిగాపులు పడుతున్నారని, ఇండిగో సిబ్బంది అబద్దాలు చెబుతూ జలగల్లా పీడిస్తున్నారని విమర్శించారు. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టులలో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. సంస్థ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో విమానాశ్రయాలలో ప్రయాణికులు ఆగ్రహంతో సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ పనితీరును డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) బుధవారం ప్రశ్నించింది. నవంబర్‌లో 1,232 విమానాలు రద్దవడంతోపాటు విమానాల రాకపోకల సమయాల్లో జాప్యం జరిగింది. ఈ పరిస్థితిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి ఇండిగోతో కలిసి మదింపు చేస్తున్నట్లు తెలిపింది.

# రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

### రైతన్నకు అండగా ఉండడమే మా విధానం

### నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు

### గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపి చూపాం

### విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు

### వైసిపి హయాంలో వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించారు

### నల్లజర్లలో రైతన్నా మీకోసంలో సిఎం చంద్రబాబు

**కాకినాడ,**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కనుక రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. రైతన్నకు అండగా ఉంటామనేది మా మొదటి నినాదం అన్నారు.. నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు బుధరం పర్యటించారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు కుటుంబాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపాం. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారకు కలుపుతాం. పెన్నా వరకూ తీసుకెళ్తాం. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నా. ఛార్జీలను పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఈ సదర్భంగా ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశువులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ. వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. జఠిలమైన వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుసంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయాలని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థితుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం. ప్రతీ ఎకరానికి నీరు అందేలా చేస్తాం. ఏపీలో తాగడానికి, వ్యవసాయానికి, పారిశ్రామికరంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంతరి అచ్చన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గోశ్ల రమేష్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# జంతర్ మంతర్ నోట్స్



ఢిల్లీ పత్రికలు రాసిన దాని ప్రకారం, జంతర్ మంతర్ గత 33 సంవత్సరాలుగా ఈ దేశ పౌరులకు నిరసన వేదికగా కొనసాగుతూ వస్తున్నది. దేశవ్యాప్తంగా అనేక వర్గాలకు, అనేక ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు అక్కడ శాంతియుతంగా నిరసనలను వేర్వేరు రూపాలలో జరుపుకుంటూ వస్తున్నారు. వారి వల్ల ప్రభుత్వానికి గాని, ప్రభుత్వం నుంచి వారికి గాని ఎన్నడూ సమస్యలు తలెత్తలేదు. ఏ కారణం వల్లనైనా నిరసనకారులను అక్కడినుంచి తొలగించవలసి వస్తే అటువంటి చర్యలు కూడా జరిగియి. ఈ 33 సంవత్సరాలలో కేంద్రంలో, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిపాలించిన వాటిలో బిజెపి కూడా ఉంది. ఆందోళనలు వారూ జరిపారు.

కాని ఎవరూ చేయని పనిని ఈనెల 11న ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం చేసింది. ఆయన ప్రభుత్వంలో హోంమంత్రి అయిన అమిత్ షా అధికార పరిధిలో పనిచేసే ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా నిషేధించారు. లోగడ ఇండియా గేట్ వద్ద జరుగుతుండిన నిరసనలకు బదులు జంతర్ మంతర్‌ను నిర్దేశిత ప్రదేశం (డిజిగ్నేటెడ్ సైట్)గా ప్రకటించింది అప్పటి అధికారులే. ఇపుడు, తమ చర్యలపట్ల ప్రజల శాంతియుత నిరసనలను సహించలేని ప్రభుత్వం, అవి అట్లానే జరుగుతుంటే తమ అధికారానికే ముప్పు రావచ్చునన్న భయంతో, జంతర్ మంతర్‌ను మూసివేసింది. అనర్థాలు ఆ చర్యను నిరసనకారుల పక్షాన లాయర్లు సుప్రీంకోర్టులో సవాలు చేయటంతో, జంతర్ మంతర్‌కు ప్రత్యామ్నాయాన్ని అయినా చూపాలని న్యాయమూర్తులు అధికారులను ఆదేశించారు. వారి ఆదేశాలను ధిక్కరించలేరు గనుక పోలీస్ అధికారులు మూడు ఇతర ప్రదేశాలనైతే ప్రకటించారు. కాని, నిరసనలు జరగకుండా చూడాలన్న చాతుర్యం అక్కడే కనిపించింది. ఆ కొత్తవి ఏవి? ఒకటి, జంతర్ మంతర్ నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరానగల రాం లీలా మైదానం. రెండు, 12 కి.మీల దూరమున్న సిబిడి గ్రౌండ్. మూడు, 18 కి.మీ ల దూరపు బురారీ మైదానం. ఈ మూడు ప్రత్యామ్నాయాల వివరాలను గమనిస్తే, అవేవీ నిరసనలకు వీలైనవి కావని, కనీసం తేలికైనవి కావని అర్థమవుతుంది. అనగా, అసలు నిరసలనకు అవకాశం ఇవ్వకపోవటం మోడీ ప్రభుత్వపు ఉద్దేశమని స్పష్టమవుతుంది. ఆ ప్రత్యామ్నాయాల చిక్కులను లాయర్లు సుప్రీం కోర్టు దృష్టికి తెస్తూ, జంతర్ మంతర్‌ను పునరుద్ధరించాలని పిటిషన్ వేశారు. దానిపై ఏమి జరిగేదీ తెలియదు. కోటలుచూడండి కాక్రోచ్ జనతా పార్టీ నాయకత్వమైతే ధిక్కారాన్ని ప్రకటించింది. జంతర్ మంతర్ ఎవరి సొత్తూ కాదన్నది. నిషేధాన్ని ఉల్లంఘిస్తూ అక్కడ యువతీ యువకులు చెదురుమదురు నిరసనలు జరుపుతుండగా పోలీసులు వారిని ప్రతి రోజు నిర్బంధించి కొడుతున్నారు. 13వ తేదీన అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌లను అరెస్ట్ చేసి 5రోజుల జుడీషియల్ కస్టడీకి పంపారు. నిరసనకారులను అన్ని రోజులపాటు కస్టడీకి పంపటం ప్రస్తుత ఆందోళనలు మొదలైన తర్వాత ఇది తొలిసారి. పూర్తి శాంతి యుతంగా నిరసన చేస్తున్న వారిపై, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారనే నేరారోపణ చేశారు. మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కొద్దినెలలుగా గమనిస్తున్న వారికి అది ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కోటలుచూడండి ప్రత్యామ్నాయ వేదికలను చూద్దాము. నిరసన కార్యక్రమాలు జంతర్ మంతర్ సహా ఎక్కడ చేపట్టాలన్నా పోలీసుల అనుమతి అవసరం. కాని జంతర్ మంతర్ వేదిక ఉచితం కాగా, తక్కిన వాటిలో రోజుకు వేలాది రూపాయల ఫీజు చెల్లించాలన్నది మొదటి తేడా. రాం లీలా కాకుండా మిగిలిన రెండు చాలా దూరం కావటం రెండవది. జంతర్ మంతర్ నిరసనలకు ప్రత్యేకించినది కాగా, మిగతా మూడింటిలో పెళ్లిళ్లు, ఉత్సవాల వంటి రకరకాలు కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాటన్నింటి మధ్య ఆ మైదానాలను చాలా ముందే బుక్ చేసుకోవలసి ఉంటుందన్నది మూడవది. జంతర్ మంతర్ వలె గాక అక్కడ చాలా పరిమిత కాలానికే బుకింగ్ చేస్తారన్నది నాల్గవది. నిరసనకారులకు ఆహారం, కాలకృత్యాలు, కనీసం కొద్ది పాటి షెల్టర్ వంటివి అక్కడ ఉండవన్నది అయిదవది. జంతర్ మంతర్, రాం లీలాలను మినహాయిస్తే తక్కిన రెండిండికి రాకపోకలు స్వంత వాహనాలు ఉన్నవారికి తప్పితే కష్టమైన పనికావటం ఆరవది. కాక్రోచ్ ఉద్యమంలో యువతులు, వృద్ధులు, పౌరులు మనం లోగడ ఎప్పుడూ చూడని స్థాయిలో పాల్గొంటున్నారు. తరచు కోర్టులనుంచి లాయర్లు వెళుతున్నారు. ఇపుడిక వీరికి కష్టమవుతుందన్నది ఏడవది.

RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గోశ్ల రమేష్ తెలుగు దినపత్రిక

బిజినెస్..

## ఆరోగ్య బీమా సంస్థలపై పాలసీదారుల ఆగ్రహం

న్యూఢిల్లీ :

అనారోగ్యం పాలయినప్పుడు అత్యవసర సమయంలో వైద్య బీమా ఉంటే ఎంతో ధీమాగా ఉంటుందని పాలసీలు కొనుగోలు చేసిన వారికి అంతిమంగా నిరాశనే ఎదురవుతోంది. హాస్పిటల్‌లో చేరిన తర్వాత అడ్డగోలు షరతులు పెట్టి.. బీమా వర్తింపునకు సంబంధిత సంస్థలు మోకాలడ్డు వేస్తోన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. వైద్య బీమా కంపెనీలపై ఫిర్యాదులు దాదాపు రెట్టింపు కావడమే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో బీమా ఉత్పత్తులపై ఫిర్యాదులు 45 శాతం పెరిగాయని.. ఇందులో ఎక్కువగా ఆరోగ్య బీమా పాలసీలపైనే ఉన్నాయని 'ఇన్సూరెన్స్ సమాధాన్' తన 2025 రిపోర్ట్‌లో వెల్లడించింది. బీమా రంగంలోని తీరుతెన్నులను విశ్లేషిస్తూ ఆ సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఆ వివరాలు.. ఫిర్యాదులు దాఖలు చేయడంలో 31 నుండి 40 సంవత్సరాల వయస్సు గల పాలసీదారులు అత్యంత చురుకుగా ఉన్నారు. దేశంలోఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 16 శాతం ఫిర్యాదులు చోటు చేసుకున్నాయి. పాలసీదారులకు తప్పుగా విక్రయించడం, క్లెయిమ్ వివాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మార్చితో ముగిసిన మొదటి త్రైమాసికంలో 684 ఫిర్యాదులు నమోదు కాగా, రెండవ త్రైమాసికంలో 974 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇది 45 శాతం పెరుగుదల. వివాదాస్పద క్లెయిమ్‌ల విలువ రూ.83.5 కోట్ల నుండి రూ.119.5 కోట్లకు పెరిగింది. ఇది 43 శాతం కంటే ఎక్కువ పెరగడం ఆందోళనకరం.

### తప్పుగా విక్రయించడం..

తప్పు దారి పట్టించే బీమా ఉత్పత్తుల విక్రయాలపై ఫిర్యాదులు 11.2 శాతం పెరిగాయి. ఇందులో ఆరోగ్య బీమా ఫిర్యాదులు 68 శాతం పెరగ్గా.. జీవన బీమాపై 25.5 శాతం, సాధారణ బీమాపై 6.9 శాతం చొప్పున ఫిర్యాదులు పెరిగాయి. ఎండోమెంట్ పాలసీలు అత్యంత తప్పుగా విక్రయించిన వాటిలో ఎక్కువగా ఉన్నాయి. ఇవి పాలసీదారులను జరిమానాలు, తక్కువ రాబడి, మూలధన క్షీణతకు గురిచేస్తున్నాయని పాలసీదారులు ఫిర్యాదు చేశారు. పాలసీదారులు, ముఖ్యంగా యువ తరాలు, తమ హక్కుల కోసం నిలబడుతున్నారని ఇన్సూరెన్స్ సమాధాన్ సహవ్యవస్థాపకురాలు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శిల్పా అరోరా తెలిపారు. ఏజెంట్లపై అధిక కమిషన్లు, విక్రయ ఒత్తిడి కారణంగా తప్పుదారి పట్టించే విక్రయ ఫిర్యాదులు పెరుగుతున్నాయన్నారు.



# సెల్ఫ్ డ్రైవింగ్ ఆటో

## స్వయంగతి పేరిట ప్రవేశపెట్టిన ఒమెగా సీకి మొబిలిటీ

న్యూఢిల్లీ :

సెల్ఫ్ డ్రైవింగ్‌తో ఎలక్ట్రిక్ ఆటో వచ్చేసింది. దీనిని డ్రైవ్ చేయడానికి ఇక డ్రైవర్లు అవసరం లేదు. ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ తయారీ సంస్థ ఒమెగా సీకి మొబిలిటీ దేశంలో తొలి సెల్ఫ్-డ్రైవింగ్ ఆటోను పరిచయం చేసింది. 'స్వయంగతి' పేరిట ఈ ఆటోను లాంఛనంగా ప్రవేశపెట్టింది. ఈ కొత్త మోడల్ ప్యాసింజర్ వెర్షన్ ధర రూ.4 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం కాగా.. కార్గో వెర్షన్ రూ.4.15 లక్షలకు (ఎక్స్ షోరూమ్) లభించనుంది. ముందస్తు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని, డెలివరీలు త్వరలో మొదలవుతాయని కంపెనీ ప్రకటించింది. స్వయంగతి ఆటో.. 10.3 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీతో వస్తుంది. ఫుల్ ఛార్జ్ చేస్తే గరిష్టంగా 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. అయితే ఈ వాహనానికి అవసరమైన ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై కంపెనీ ఇంకా వివరాలు వెల్లడించలేదు.

ఇందులో కంపెనీ ఇవి ప్లాట్‌ఫాంతో పాటు ఎఐ ఆధారిత అటానమీ సిస్టమ్ ఉంది. లైడార్ టెక్నాలజీ, జిపిఎస్, 6 కిలోమీటర్ల దూరం వరకు అడ్డంకులను గుర్తించే సెన్సర్లు, మల్టీ సెన్సర్ నావిగేషన్, రిమోట్ సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. డ్రైవర్ లేకుండానే ముందుగానే మ్యాప్ చేసిన మార్గంలో ప్రయాణించగలదు. మొదటి దశ పరీక్షలు విజయవంతం కాగా.. రెండో దశ పరీక్షలు త్వరలో నిర్వహిస్తామని సంస్థ చెప్పింది. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో నియంత్రిత కమర్షియల్ ఆపరేషన్లు ప్రారంభం కానున్నాయి. విమానాశ్రయాలు, టెక్ పార్కులు, గేటెడ్ కమ్యూనిటీలు, పారిశ్రామిక ప్రాంతాలు, స్మార్ట్ సిటీల్లో స్వయంగతి ఆటోలను ప్రవేశపెట్టే యోచనలో కంపెనీ ఉంది. రాబోయే రెండేళ్లలో 1,500 సెల్ఫ్ డ్రైవింగ్ త్రీ-వీలర్లను ఉత్పత్తి చేయాలని ఒమెగా సీకి ప్రణాళికలు వేసింది. భారత రవాణా రంగంలో స్వయంగతి ఆవిష్కరణ కీలకమైందని కంపెనీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఉదరు నారాంగ్ తెలిపారు. 'ఎఐ, లైడార్, ఆటానమస్ నావిగేషన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని భారత్‌లోనే అభివృద్ధి చేసి, అందరికీ అందుబాటులో ఉండే ధరలో తీసుకొచ్చాం' అని తెలిపారు.




## భారత్ వృద్ధిరేటు అంచనాలు తగ్గింపు

న్యూఢిల్లీ :

భారత్ వృద్ధిరేటు అంచనాలను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఆసియాన్ డెవలప్‌మెంట్ ఔట్‌లుక్ నివేదిక వెల్లడించింది. ఈ యేడాది ప్రథమార్థంలో 7.8 శాతం వృద్ధిరేటు నమోదు చేసినా.. ద్వితీయార్థంలో అదికాస్త తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.మెరుగైన వినియోగం, ప్రభుత్వ వ్యయం కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధిరేటు 7.8 శాతంగా నమోదైంది. అయితే అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల ప్రభావం ఎగుమతులపైనా పడుతుందని, అందువల్లే ఈ ఆర్థిక సంవత్సరం రెండోభాగంతో పాటు వచ్చే ఏడాదిలోనూ వృద్ధి రేటు తగ్గనుంది. అయితే స్థిరమైన దేశీయ డిమాండ్, సేవారంగ ఎగుమతులు సుంకాల ప్రభావాన్ని కాస్త తగ్గించొచ్చని నివేదికలో పేర్కొంది. ఇతర దేశాలకు ఎగుమతులు పెరగడం, జిడిపిలో వాటి వాటా తక్కువగా ఉండటం కలిసొస్తుందని తెలిపింది. ఇక, బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు 4.4 శాతం. అయితే అప్పుడు జిఎస్‌టి కోతలను అందులో ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ కోతలతో పన్ను ఆదాయం కొంతమేర తగ్గి, ద్రవ్యలోటు పెరిగేందుకు కారణమవుతుందని ఈ నివేదిక అంచనా వేసింది.



## జిల్లా ప్రజలకు కలెక్టర్ మను చౌదరి దసరా శుభాకాంక్షలు



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన శాశ్వత విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులను, అనంతమైన సంతోషాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు. జీవితాల్లోని ప్రతికూలతలను, కష్టాలను అధిగమించి ఆశావహ దృక్పథంతో నూతన విజయాల వైపు ముందడుగు వేసేందుకు దసరా పర్వదినం సరికొత్త ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.దుర్గామాత దివ్య ఆశీస్సులతో జిల్లాలోని సమస్త ప్రజానీకం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కలెక్టర్ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. పండుగలు కేవలం సంప్రదాయాలకే పరిమితం కాకుండా, సమాజంలో పరస్పర ఆత్మీయతను, ఐక్యతను చాటేందుకు గొప్ప వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఈ వేడుకలను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, ఆనందోత్సాహాల నడుమ, దృఢమైన సోదరభావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.సమాజ హితం కోసం, వ్యక్తిగత వికాసం కోసం ప్రజలు వేసే ప్రతి అడుగు విజయవంతం కావాలని కలెక్టర్ అభిలషించారు. ధర్మం, న్యాయం, సత్య మార్గంలో పయనించడమే దసరా అందించే పరమార్థమని, ఆ స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాల్లో మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన ఆకాంక్షించారు.

# భూవివాద రహిత తెలంగాణే లక్ష్యం: 'భూభారతి'తో పరిష్కారం



దశాబ్దాలుగా తెలంగాణ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అన్నదాతలను, సామాన్య ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేసిన భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగాన్ని సమూలంగా పునర్నిర్మిస్తోంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో శాఖాపరమైన సంస్కరణలు, క్షేత్రస్థాయి ఫలితాలపై సమగ్ర సమీక్ష సాగింది. 'భూభారతి' చట్టం పటిష్ట అమలు, రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ వేగవంతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రతిష్టాత్మక భూముల సమగ్ర రీ–సర్వే ప్రక్రియ మరియు ఇటీవలి కాలంలో ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక విధానాల అమలు తీరుపై ఈ భేటీలో కీలక చర్చ జరిగింది. దరఖాస్తుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పే పురాతన సంస్కృతికి స్వస్తి పలికి, ప్రజలకు రెవెన్యూ సేవలు అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా అందేలా ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పకడ్బందీగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.గత పాలకుల నిర్లక్ష్యం, ప్రణాళికారాహిత్యం మరియు స్వార్థపూరిత నిర్ణయాల కారణంగా గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని సమీక్షలో ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. లోపభూయిష్టమైన విధానాలు, సాంకేతిక సమస్యల వల్ల లక్షలాది మంది రైతులు తమ సొంత భూములకు హక్కులు నిరూపించుకోలేక కోర్టులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ చారిత్రక తప్పిదాలను సరిదిద్ది, రాష్ట్రంలో ఎక్కడా ఒక్క సెంటు భూమి కూడా వివాదంలో ఉండకూడదన్న పవిత్ర సంకల్పంతో సరికొత్త 'భూభారతి' చట్టాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహిస్తున్న భూముల రీ–సర్వే ద్వారా సరిహద్దు తగాదాలకు, యాజమాన్య వివాదాలకు శాశ్వతంగా తెరదించుతూ, ప్రతి భూకమతానికి పక్కా చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తోంది. ఈ నూతన సంస్కరణల ద్వారా క్షేత్రస్థాయిలో గణనీయమైన ఫలితాలు కనిపిస్తున్నాయి. 'భూభారతి' చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రికార్డు స్థాయిలో ఏకంగా 5,68,858 కొత్త పాస్‌బుక్కులను ప్రభుత్వం అర్హులైన రైతులకు పంపిణీ చేసింది. అదేవిధంగా, గడిచిన 34 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,40,366 పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు అందజేయడం విశేషం. ఈ నిర్ణయం వల్ల లక్షలాది రైతు కుటుంబాలకు తమ వ్యవసాయ భూములపై పూర్తిస్థాయి హక్కులు దక్కడంతో పాటు, పంట సాగుకు అవసరమైన బ్యాంక్ రుణాలు, రైతు భరోసా ఆర్థిక సాయం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరాటంకంగా పొందే వెసులుబాటు కలిగింది. భూ యాజమాన్య హక్కులు స్పష్టంగా ఉండటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సరికొత్త భరోసా లభించింది.ఈ సర్వే ప్రక్రియను కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి సర్వే నంబర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా రీ–సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఎప్పటికప్పుడు ప్రజల నుంచి అందే వినతులను యుద్ధప్రాతిపదికన పరిశీలిస్తూ, అసలైన హక్కుదారులకు ఎలాంటి పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వారి చేతికే పాస్‌బుక్కులు అందించే కార్యాచరణ కొనసాగుతోంది. భూ సమస్యల పరిష్కారం కేవలం పరిపాలనాపరమైన విధి మాత్రమే కాదని, అది రైతాంగం ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతతో ముడిపడి ఉన్న అంశమనే దృక్పథంతో ప్రభుత్వం చేపడుతున్న ఈ రెవెన్యూ పునర్నిర్మాణం, తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారనుంది.

## రంగారెడ్డి ప్రజలకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి దసరా శుభాకాంక్షలు



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన శాశ్వత విజయానికి ప్రతీకగా నిలిచే ఈ మహోన్నత పండుగ, జిల్లా ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులను, అనంతమైన సుఖసంతోషాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు.జీవితంలో ఎదురయ్యే ఎలాంటి ప్రతికూలతలు, కష్టనష్టాలనైనా దృఢ సంకల్పంతో అధిగమించి, ఆశావహ దృక్పథంతో నూతన విజయాల వైపు ముందడుగు వేసేందుకు దసరా పర్వదినం గొప్ప ఆత్మస్థైర్యాన్ని, సరికొత్త ప్రేరణను అందిస్తుందని పేర్కొన్నారు.సకల శుభాలను ప్రసాదించే జగన్మాత దుర్గాదేవి దివ్య ఆశీస్సులతో రంగారెడ్డి జిల్లాలోని సమస్త ప్రజానీకం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుభిక్షమైన జీవితంతో వర్ధిల్లాలని కలెక్టర్ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. పండుగలు కేవలం సంప్రదాయాల ఆచరణకే పరిమితం కాకుండా, సమాజంలో పరస్పర ప్రేమాభిమానాలు, ఆత్మీయతలు మరియు సాంఘిక ఐక్యతను చాటేందుకు అత్యుత్తమ వేదికలుగా నిలవాలని ఆయన అభిలషించారు. ప్రజలందరూ ఈ వేడుకలను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, ఆనందోత్సాహాల నడుమ, దృఢమైన సోదరభావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ధర్మం, న్యాయం, సత్య మార్గంలో పయనించడమే దసరా పండుగ మానవాళికి అందించే పరమార్థమని గుర్తుచేసిన కలెక్టర్, సమాజ హితం కోసం, వ్యక్తిగత వికాసం కోసం ప్రతి ఒక్కరూ వేసే అడుగు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆ మహోన్నత స్ఫూర్తితోనే రంగారెడ్డి జిల్లాను అన్ని రంగాలలో ఆదర్శవంతంగా, మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే బృహత్కార్యంలో ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి: కవిత డిమాండ్



రాష్ట్రంలో తీవ్రమవుతున్న సాగునీటి ఎద్దడి, కరువు పరిస్థితుల నుంచి అన్నదాతలను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ ప్రణాళికలతో ముందుకెళ్లాలని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత నది ప్రవాహాన్ని సోమవారం పార్టీ నాయకులతో కలిసి స్వయంగా పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. నదిలో అమూల్యమైన జలాలు వృథాగా దిగువకు పోతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ సమస్యలను సాకుగా చూపుతూ రైతాంగానికి సాగునీరు అందకుండా చేయడం తీవ్ర అన్యాయమని, పాలకుల



అలసత్వం వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో తక్షణమే కాఫర్ డ్యాం నిర్మించడమే ఏకైక పరిష్కారమని కవిత సూచించారు. కేవలం రూ. 25 కోట్ల నామమాత్రపు వ్యయంతో, నెలన్నర రోజుల వ్యవధిలోనే ఈ కాఫర్ డ్యాం నిర్మాణాన్ని పూర్తి చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ తాత్కాలిక నిర్మాణం ద్వారా ప్రాణహిత వరద ప్రవాహాన్ని అడ్డుకట్ట వేసి, అన్నారం మరియు సుందిళ్ల బ్యారేజీలకు నిరాటంకంగా నీటిని ఎత్తిపోసే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఫలితంగా వేలాది ఎకరాల ఆయకట్టుకు సకాలంలో సాగునీరందించి పంటలు కాపాడబడతాయని, రైతులకు భరోసా దక్కుతుందని వివరించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమే 'మన నీళ్లు మనకే' అన్న ప్రధాన నినాదంతో సాగిందని, ప్రాణహిత, గోదావరి, కృష్ణా నదీ జలాలను సంపూర్ణంగా ఒడిసిపట్టినప్పుడే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని ఆమె గుర్తుచేశారు. సమృద్ధిగా నీటి లభ్యత ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యల పేరిట జలాలను వృథాగా పోనివ్వడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మాణ పనులను ప్రారంభించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన కన్నెపల్లి పంప్‌హౌస్ వేదికగా భారీ ఎత్తున ప్రజా ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు.

### రూ.25 కోట్లతో నెలన్నరలో పనులు పూర్తి

ప్రస్తుతం ప్రాణహిత నదిలో రోజుకు రెండు టీఎంసీల నీరు ప్రవ హిస్తున్నా వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని కవిత అన్నారు. సుమారు రూ.25 కోట్లతో కాఫర్ డ్యాం నిర్మాణ పనులను నెలన్నరలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ఈ నిర్మాణంతో మేడిగడ్డపై ఆధారపడకుండా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నీటిని ఎత్తిపోసి, అనుసంధానిత ప్రాజెక్టుల్లో నీటిని నింపుకోవచ్చని వివరించారు. ఈ ప్రతిపాదనకు సంబంధిం చిన సాంకేతిక వివరాలను ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వచ్చే ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షపాతం ఎలా ఉంటుందోనన్న ఆందోళన ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోవడం అత్యవసరమని అన్నారు. ఇంజినీర్లు తమ ప్రతిపాదనల్లో మార్పులు సూచిస్తే వాటిని స్వీక రించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై భారీగా ఖర్చు చేసి పాత ఆయకట్టును స్థిరీకరించేందుకు ప్రయత్నాలు జరిగాయని కవిత తెలిపారు. కృష్ణా నదిపై ప్రాజెక్టుల ద్వారా నాలుగు నుంచి ఐదు లక్షల ఎకరాలకు నీరందించారని చెప్పారు. ఉత్తర తెలంగాణలో ఎస్సారెస్పీ, కడెం, అప్పర్ మానేరు, మిడ్ మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టుల కింద ఆయకట్టు స్థిరీకర ణకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

## బతుకమ్మ వేడుకల్లో సర్‌ప్రైజ్: మహిళలతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకల వేళ ఆలేరు నియోజకవర్గంలో సరికొత్త ప్రజాస్వామిక దృశ్యం ఆవిష్కృతమైంది.యాదగిరిగుట్ట పరిధిలోని క్రాంతి నగర్‌లో బతుకమ్మ సంబురాల్లో నిమగ్నమైన ఆడపడుచుల వద్దకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య ఎలాంటి ముందస్తు సమాచారం, అధికారిక ప్రోటోకాల్ హంగులు లేకుండా అకస్మాత్తుగా చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. సాధారణంగా ప్రజాప్రతినిధుల పర్యటనలంటే భద్రతా సిబ్బంది, కాన్వాయ్ మోతలు, ముందస్తు హడావుడి కనిపించే సంస్కృతికి భిన్నంగా, ఏ ఒక్కరికీ చెప్పకుండా ఒక సామాన్య కుటుంబ సభ్యుడిలా ఆయన నేరుగా కాలనీ మహిళల మధ్యకు నడిచివచ్చారు. ఊహించని రీతిలో తమ మధ్య ప్రత్యక్షమైన ఎమ్మెల్యేను చూసి క్రాంతి నగర్ మహిళలు ఒక్కసారిగా విస్మయానికి గురైనప్పటికీ, మరుక్షణమే ఆయనను తమ సొంత మనిషిలా ఆత్మీయంగా ఆహ్వానించారు.ప్రజలతో నాయకత్వం మమేకం కావడమంటే కేవలం సభలు, సమావేశాలకే పరిమితం కాదని, ప్రజల పండుగలు, భావోద్వేగాల్లో స్వచ్ఛంగా పాలుపంచుకోవడమే అసలైన ప్రజా సంబంధమని ఈ ఆకస్మిక పర్యటన నిరూపించింది.

## కోల్ కంట్రోలర్ సంస్థకు ప్రతిష్టాత్మక స్కోచ్ గోల్డ్ అవార్డ్ 2026



కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోల్ కంట్రోలర్స్ ఆర్గనైజేషన్ సాంకేతిక ఆవిష్కరణల విభాగంలో జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. మైనింగ్ ప్రక్రియ పూర్తయి మూతపడిన బొగ్గు గనుల భూములను సమర్థవంతంగా పునర్వినియోగంలోకి తెచ్చేందుకు రూపొందించిన అత్యాధునిక వెబ్ అప్లికేషన్ 'సువికల్ప్' ( మైన్ రీపర్పసింగ్ టూల్) జియాలజీ అండ్ మైనింగ్ విభాగంలో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక 'స్కోచ్ గోల్డ్ అవార్డు – 2026'ను కైవసం చేసుకుంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో అధికారులు ఈ పురస్కారాన్ని ప్రదర్శించగా, మైనింగ్ రంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్న సంస్థ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.సాధారణంగా బొగ్గు తవ్వకాలు పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాలు నిరుపయోగంగా మారి పర్యావరణానికి, స్థానిక సమాజానికి తీవ్ర సవాలుగా పరిణమించేవి. ఈ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించే దిశగా 'సువికల్ప్' ఒక విప్లవాత్మక డిజిటల్ వేదికగా సేవలందిస్తోంది. మూతపడిన గనుల భూముల పునర్వినియోగంపై అత్యంత పారదర్శకమైన, కచ్చితమైన డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునేందుకు ఈ టూల్ యంత్రాంగానికి ఉపకరిస్తుంది. ఏయే ప్రాంతాల్లో పర్యావరణాన్ని పునరుద్ధరించవచ్చు, వేటిని సోలార్ పార్కులు లేదా ఇతర ప్రత్యామ్నాయ పారిశ్రామిక, ఆర్థిక కేంద్రాలుగా మార్చవచ్చో శాస్త్రీయంగా విశ్లేషించేందుకు ఇది మార్గం సుగమం చేస్తోంది.గనుల పరిసర ప్రాంతాల్లో 'జస్ట్ ట్రాన్సిషన్' (న్యాయమైన ఆర్థిక–పర్యావరణ పరివర్తన) సాధించడంలో ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలక పాత్ర పోషించనుంది. మైనింగ్ ముగిసిన అనంతరం స్థానిక ప్రజలు ఉపాధి కోల్పోకుండా సరికొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించడం, పర్యావరణ పునరుజ్జీవనం ద్వారా స్థానిక వర్గాల ఆరోగ్యం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ విధానం ప్రధాన ధ్యేయం. గనుల తవ్వకంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ, స్థానిక ప్రజల సంక్షేమానికి భరోసానిచ్చే దిశగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ బృహత్తర సంస్కరణకు స్కోచ్ గోల్డ్ అవార్డు దక్కడం దేశవ్యాప్త మైనింగ్ రంగానికే సరికొత్త ప్రేరణగా నిలుస్తోంది.








నకిరేకల్

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నకిరేకల్ మండలం పరడ గ్రామంలో, ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు సందర్శించి అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, కోరుకున్నారు.

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ పార్టీ నాయకులు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

అన్వేషణనేత్రం

# రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**నల్లగొండ:**

రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరారు.కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఈ పండుగ శుభాలను తీసుకురావాలని కోరారు. పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించుకుంటూ దసరా పండుగను జరుపుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, ప్రజల ఆశయాలు నెరవేరాలని మంత్రి కోమటిరెడ్డి ఆకాంక్షించారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.

# నల్లగొండలో పోలీసుల మెరుపు తనిఖీలు!

౹౹రౌడీషీటర్లు, ట్రబుల్ మంగర్స్, మత్తు పదార్థాల వినియోగదారులకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరిక!
ప్రవర్తన మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు.. తాటతీసుడే!
వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు..
పోలీసుల తనిఖీల్లో 59 మంది అదుపులోకి..
డ్రగ్ టెస్టుల్లో 15 మంది గంజాయి లేదా మత్తు టాబ్లెట్లు వినియోగించినట్లు ప్రాథమిక నిర్ధారణ..
మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? సరఫరా చేస్తున్నదెవరు?
మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై పోలీసుల ప్రత్యేక నిఘా..
గంజాయి, మత్తు టాబ్లెట్ల సరఫరాదారులపై ఆరా!




రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, బ్లాక్‌మెయిలర్లపై నిరంతర నిఘా..
బెదిరింపులు, సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదు..
మత్తు పదార్థాల వినియోగదారులకు కౌన్సెలింగ్...
అవసరమైన వారికి పునరావాస కేంద్రాలకు పంపించే చర్యలు...
ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందిస్తాం -- జిల్లా ఎస్పీ..
మత్తు పదార్థాలు, బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌పై సమాచారం ఉంటే 112కు ఫోన్ చేయాలి...
గంజాయి, మత్తు పదార్థాల నిరోధక టోల్ ఫ్రీ నంబర్: 8712670266..
ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీసుల చర్యలు..
నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్??
ఈ తనిఖీల్లో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు ముత్తయ్య, సైదులు, టూ టౌన్ ఎస్ఐ సైదాబాబు, రూరల్ ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ల్యాదెల్లలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి

?(దామెర – అన్వేషనేత్రం దినపత్రిక, అక్టోబర్ 19, 2026)
?దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో చాలెంజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాల్లో రెడ్‌క్రాస్ చైర్మన్, బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



?అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవి అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో శ్రేయస్సు, సుఖసంతోషాలు విలసిల్లాలని ఆకాంక్షించారు. ల్యాదెల్ల గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న చాలెంజ్ యూత్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.
?ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, నాయకులు పిట్టల రమేష్, మాందాటి శ్రీకాంత్, పిడుగు అనిల్, డెంగు నవీన్, సింధె శ్రీనివాస్, అన్నబోయిన రోహిత్, బత్తుల విశ్వంత్, ననబోయిన శ్రీనివాస్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి శిశు మందిరంలో క్రమశిక్షణే ఉన్నత స్థాయికి మార్గం: కేంద్రీయ ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**(వర్ధన్నపేట - అన్వేషనేత్రం దినపత్రిక, అక్టోబర్ 19, 2026)**

సంస్కారానికి, విద్యాబుద్ధులకు నిలయం శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల అని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద గ్రామంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1981 నుండి 2002 విద్యా సంవత్సరాల మధ్య చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ.. చిన్ననాటి స్నేహితులను, చదువుకున్న పాఠశాలను మరువకుండా దశాబ్దాల తర్వాత ఇలా అందరూ ఒకే వేదికపైకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. సరస్వతి శిశు మందిరాలలో లభించే సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని తెలిపారు. ఎవరెంత ఉన్నత స్థాయిలో స్థిరపడినా తాము చదువుకున్న బడిని, చిన్ననాటి మిత్రులను మరువకుండా దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషకరమని, ఈ ఆత్మీయ కలయిక నేటి తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.
విద్యార్థుల సుదీర్ఘ స్నేహ బంధం, పాఠశాల పట్ల వారికున్న కృతజ్ఞతా భావం, గురువుల ఆశీస్సులు మరియు పాత జ్ఞాపకాల ముచ్చట్లతో ఇల్లంద గ్రామం నేడు ఆత్మీయతతో పులకించిపోయిందని అన్నారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, కరిమిల్ల సంపత్ రావు, పెంచాను కుమార స్వామి, రాజు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, డాక్టర్ రాజేశ్వర్ రావు తకళ్లపల్లి మరియు అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నకిరేకల్ మండలం పాలెం, చందుపట్ల, మరియు నకిరేకల్ టౌన్ చీమలగడ్డ లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను యువ నాయకులు శ్రీ వేముల విపుల్ గారు సందర్శించి, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారిని ప్రార్థించారు.
అనంతరం ఆయా గ్రామాల దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు వేముల విపుల్ గారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# దేవరకొండ 10వ వార్డులో దుర్గామాతను దర్శించుకున్న ఢిల్లీ రమేష్

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు బ్రహ్మగిరిలో ఉన్న శ్రీ శ్రీ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన దుర్గామాతను ఢిల్లీ రమేష్





దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, దేవరకొండ పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో 10వ వార్డు గౌరవ అధ్యక్షులు చేపూరి భీష్మాచారి, ప్రధాన కార్యదర్శి వింజమూరు బ్రహ్మచారి, కోశాధికారి కూరెళ్ల ఇంద్రాచారి, మహేశ్వరం వేణుగోపాలాచారి, గన్నోజు సంతోష్, తల్లోజు ఆంజనేయాచారి, చోల్లేటి మణికంఠాచారితో పాటు దుర్గామాత యూత్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి: చల్లా ధర్మారెడ్డి

?(ఆత్మకూరు – అన్వేషనేత్రం దినపత్రిక, అక్టోబర్ 19, 2026)
?ఆధ్యాత్మికతతో పాటు గ్రామీణ ఐక్యతను చాటిచెప్పే పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రోత్సవాల్లో సోమవారం ఉదయం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.
?అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. దైవభక్తితో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామస్తుల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని అన్నారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని, గ్రామాల్లో సిరిసంపదలు వెల్లివిరియాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.
?నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యాలు నిండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత దీక్షాపరులు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.





# మద్యం తాగి వాహనాలు నడపొద్దు...

ప్రాణాల కంటే పండుగ సంబరాలు ముఖ్యం కాదు

దేవరకొండ ప్రజలకు ఎమ్మెల్యే బాలునాయక్ విజయదశమి శుభాకాంక్షలు

దేవరకొండ,అక్టోబర్ 19 (అన్వేషనేత్రం):చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశలు, ఆనందాలు నింపాలని,



ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ధర్మం, న్యాయం, సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తాయనే సందేశాన్ని విజయదశమి చాటిచెబుతుందని బాలునాయక్ అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు. నియోజకవర్గంలోని రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

పండుగ వేళ యువత ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకోవాలని, అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. క్షణిక నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలిగొనడమే కాకుండా కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతుందని హెచ్చరించారు. పండుగ సంబరాలు ప్రమాదాలకు కారణం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ భద్రతతోపాటు ఇతరుల ప్రాణాల రక్షణకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు తీవ్ర వేదనను అనుభవిస్తున్నాయని బాలునాయక్ అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు భద్రతా పట్టీలు పెట్టుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు చరవాణి వినియోగించవద్దని, వేగ పరిమితులను దాటకుండా, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. మద్యం సేవించిన వారు వాహనాలు నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని, స్నేహితులు, కుటుంబ సభ్యులు సైతం ప్రమాదకర ప్రయాణాలను ప్రోత్సహించవద్దని సూచించారు. "మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంటుంది. సురక్షితంగా ఇంటికి చేరడం కంటే గొప్ప పండుగ మరొకటి లేదు" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

దేవరకొండ నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడం, మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తానన్నారు. ఈ విజయదశమి రైతులకు మంచి పంటలు, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సురక్షితంగా పండుగ జరుపుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుతూ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

# 30 అడుగుల లోతు తవ్వకాలతో ఇళ్లకు ముప్పు!

## ఎస్టీపీ నుంచి అర్బన్ ఆసుపత్రి వరకు యూజీడీ పనులు నిలిపివేయాలి.. బండరాళ్ల కోసం పేలుళ్లతో ప్రమాదం.. ఎనిమిది నెలలుగా నిలిచిన పనులతో రాకపోకలకు అంతరాయం

3వ డివిజన్ కార్పొరేటర్ పెర్ల మల్లీశ్వరి అశోక్ చంద్ర

నల్లగొండ, సెప్టెంబర్ 19 ( అన్వేషనేత్రం):

నగరంలోని మూడో డివిజన్ పరిధిలో ఎస్టీపీ నుంచి అర్బన్ ఆసుపత్రి వరకు చేపడుతున్న భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ) పనులు స్థానికుల ప్రాణాలకు, ఆస్తులకు ముప్పుగా మారాయని డివిజన్ కార్పొరేటర్ పెర్ల మల్లీశ్వరి అశోక్‌చంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య 30 అడుగుల లోతు, 20 అడుగుల వెడల్పుతో తవ్వకాలు చేపట్టడంతో పాటు, బండరాళ్లను తొలగించేందుకు తగిన భద్రతా చర్యలు లేకుండా పేలుళ్లు జరుపుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, పనులపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లెప్రసీ కాలనీ సమీపంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) నుంచి రామలక్ష్మణ్ పారాబాయిల్డ్ రైస్ మిల్లు మీదుగా ఎన్జీవో కాలనీ, నందీశ్వర కాలనీ, సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలోని అర్బన్ ఆసుపత్రి వరకు యూజీడీ పైపులైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. అద్దంకి బైపాస్ రోడ్డు వరకు ఇళ్లు లేని ప్రాంతంలో పనులు చేపట్టినప్పటికీ, ఎనిమిది నెలలు కావస్తున్నా నిర్మాణం పూర్తికాకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. అద్దంకి బైపాస్ రోడ్డు దాటిన తర్వాత ఎన్జీవో కాలనీ, నందీశ్వర కాలనీ మీదుగా అర్బన్ ఆసుపత్రి వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఈ ప్రాంతంలో ప్రజలు ఏళ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ రోడ్డు వెడల్పు కేవలం 20 అడుగులే ఉండగా, అదే వెడల్పుతో 30 అడుగుల లోతున తవ్వకాలు చేపడుతున్నారని వివరించారు. తవ్వకాల సమయంలో బండరాళ్లు ఎదురవుతుండటంతో కాంట్రాక్టర్ ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టకుండానే పేలుళ్లు జరుపుతున్నారని ఆరోపించారు. దీంతో



రాళ్లు ఇళ్లపై, వాహనాలపై, ప్రజలపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లోతైన తవ్వకాల వల్ల ఇళ్లు దెబ్బతినడంతో పాటు కూలిపోయే ప్రమాదం ఉందని, నివాసితులు ఇళ్లలోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి పైపులైన్లు, ఇప్పటికే ఉన్న మురుగునీటి పారుదల లైన్లు దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ప్రస్తుత పనులపై సమగ్ర విచారణ జరిపించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గంలో పైపులైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పెర్ల మల్లీశ్వరి అశోక్‌చంద్ర జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# వెట్టి చాకిరి నిర్మూలనకు విస్తృత ప్రచారం

ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్ చంద్రశేఖర్

నల్లగొండ, సెప్టెంబర్ 19 (అన్వేషనేత్రం): వెట్టి చాకిరి నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. వెట్టి చాకిరి మానవ హక్కులకు విరుద్ధమని, ఎవరినైనా బలవంతంగా పనుల్లోకి దింపడం, శ్రమను దోపిడీ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. సమాజంలో వెట్టి చాకిరి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.



వెట్టి చాకిరి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నల్లగొండ జిల్లాలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి బాధితులను గుర్తించి, వారికి అండగా నిలవడంతోపాటు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజలు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలని, ఎక్కడైనా వెట్టి చాకిరి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ రమేష్, ఉప కార్మిక కమిషనర్ చంద్రశేఖర్, బాలల సంక్షేమ కమిటీ ఛైర్మన్ చింత కృష్ణ, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయకర్త పాల్గొన్నారు. అంతర్జాతీయ న్యాయ మిషన్ ప్రతినిధి నోయల్, ఆదిభూమి సంస్థ ప్రతినిధి శంకర్‌తోపాటు గజ్వేల్ కళాబృందం సభ్యులు వంశీ, రాధ, ప్రతాప్, వేణు, లత, హాజరయ్యారు.

# చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి

రాష్ట్ర ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు



నల్లగొండ, సెప్టెంబర్ 19 ( అన్వేషనేత్రం): విజయదశమి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నారు. కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో విజయదశమి కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించుకుంటూ పండుగను జరుపుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రజల ఆశయాలు నెరవేరాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.



నిరుపేద కుటుంబంలో పుట్టిన బిజెపి సామాన్య కార్యకర్త నిరంతరం బిజెపి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తు ప్రజ సమస్యలు అనునిత్యం పోరాటం చేస్తు ఈ రోజు భారతీయ జనతా పార్టీ యువ మొర్చ నల్లగోండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నికైన రామన్నపేట మండలం జనంపల్లి గ్రామం అక్కేనపల్లి సైదులు గారు ఈ ఎన్నిక ఓ సామాన్య కార్యకర్తకు పార్టీ ఇస్తూన గౌరవం ఈ పదవి భాద్యత ఇచ్చిన బిజెపి జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రేడ్డి గారికి బిజెవైయం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతిష్ యాదవ్ గారికి మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గారికి బిజెవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ గారికి బిజెవైయం ప్రభారి గౌతమ్ జీ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూన్న అక్కేనపల్లి సైదులు అలాగే అనునిత్యం నావేంటే ఉండి నన్ను ప్రోత్సహిస్తూ నాకు సహకరిస్తున్న రాష్ట్ర జిల్లా మండల బిజెపి సీనియర్ నాయకులకు బిజెవైయం యువ నాయకులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా నా హృదయ పూర్వక ధన్యవాదాలు..

నాకు ఇచ్చిన బాధ్యతను క్రమ శిక్షణ గా పార్టీ గౌరవిస్తూ సిద్ధాంతాలను పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను....

ధన్యవాదములు...

# విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు!??

పీఏ పల్లి మరియు గుడిపల్లి మండలాల గౌరవ ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు.
మీ కష్టసుఖాల్లో తోడుంటూ... మన ఊరి ప్రగతి కోసం, మీ నమ్మకమైన నాయకుడిగా...
రాబోయే జెడ్పీటీసీ ఎన్నికల్లో మీ ఆశీస్సులకై మీ ముందుకు వస్తున్నాను.
మార్పు కోసం.. ప్రగతి కోసం.. కాంగ్రెస్ పార్టీతో అడుగులు వేద్దాం!
. డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి




నకిరేకల్ నియోజకవర్గం

ఈ రోజు నకిరేకల్ నియోజకవర్గ కేంద్రం లోని పద్మశాలి కాలనీ లో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపి జుఃశ మీూా దైద సుందరయ్య ఫౌండేషన్ ద్వారా బతుకమ్మ ఆడిన ప్రతి మహిళా సోదరీమణులకు బహుమతులు అందజేసిన

దైద రవీందర్ గారు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

గార్లపాటి రవీందర్ రెడ్డి

నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

చేరుపల్లి సైదులు, పశుపతి, రఘుపతి, పద్మ, మురళి మరియు తదితరులు పాల్గొన్నారు.






RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

## ఆట









# కోహ్లీ, ధోనీ సరసన సునీల్ నరైన్..

ధనాధన్ లీగ్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ నరైన్ కెరీర్‌లో ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున అతడికి ఇది 200వ ఐపీఎల్ మ్యాచ్. లీగ్ చరిత్రలో ఒకే జట్టు తరపున ఈ మైలురాయిని అందుకున్న నలుగురు అగ్రశ్రేణి ఆటగాళ్ల జాబితాలోకి నరైన్ చేరిపోయాడు. నిలకడకు, జట్టుపై ఉన్న విధేయతకు ప్రతీకగా నిలిచిన ఆటగాళ్లు మాత్రమే ఈ ఘనత సాధించారు. 2008 తొలి సీజన్ నుంచి బెంగళూరు జట్టుతోనే ఉన్న విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆ తర్వాత ధోనీ, రోహిత్ శర్మ వంటి భారతీయ క్రికెట్ దిగ్గజాలు ఉన్నారు. ఇప్పుడు వీరి సరసన ఓ విదేశీ ఆటగాడిగా నరైన్ నిలవడం అతడి అంకితభావానికి నిదర్శనం. సునీల్ నరైన్ కేవలం మ్యాచ్‌లు ఆడటమే కాదు, కోల్‌కతా జట్టుకు ఎన్నో అద్భుత విజయాలను అందించాడు. ఐపీఎల్ కెరీర్ మొత్తంలో అతడు ఇప్పటివరకు 203 వికెట్లు పడగొట్టాడు. ఇందులో కేవలం 19 పరుగులిచ్చి 5 వికెట్లు తీయడం అతడి అత్యుత్తమ ప్రదర్శన. బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తూ కేవలం 6.78 ఎకానమీతో బౌలింగ్ చేయడం నరైన్‌కే చెల్లింది. లోయర్ ఆర్డర్‌లో వచ్చి మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడే పించ్ హిట్టర్‌గానూ జట్టుకు ఎన్నో సేవలు అందించాడు. ప్రస్తుత సీజన్‌లోనూ నరైన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ఆడిన పది మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసినప్పటికీ, అతడి ఎకానమీ రేటు 6.64గా ఉండటం గమనార్హం. పరుగులు వరదలా పారుతున్న ఈ లీగ్‌లో ఇంత తక్కువ ఎకానమీతో బౌలింగ్ చేయడం విశేషం. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లతో జరిగిన మ్యాచ్‌లలో రెండేసి వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటర్ల జోరుకు అడ్డుకట్ట వేశాడు. వ్యక్తిగతంగా సునీల్ నరైన్ అద్భుత మైలురాయిని అందుకున్నప్పటికీ, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు పరిస్థితి మాత్రం ప్రస్తుతం అంత ఆశాజనకంగా లేదు. ప్లేఆఫ్స్ రేసులో ఆ జట్టు ఉనికి ఇప్పుడు చెదిరిపోయే స్థితికి చేరింది. బెంగళూరుతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఓడిపోవడంతో కేకేఆర్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. సమీకరణాల ప్రకారం కోల్‌కతా జట్టు టోర్నీలో నిలవాలంటే ఇకపై ఆడబోయే మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ తేడాతో విజయం సాధించాలి. అంతటితో ఆగకుండా, మిగిలిన జట్ల గెలుపోటములు, నెట్ రన్ రేట్ వంటి ఎన్నో లెక్కలు కోల్‌కతాకు అనుకూలంగా రావాల్సి ఉంటుంది. మిగతా జట్లు మెరుగైన ఫామ్, రన్ రేట్‌తో దూసుకుపోతుండటంతో, ఈ సీజన్‌లో కోల్‌కతా ప్లేఆఫ్స్‌కు చేరడం దాదాపు అసాధ్యమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# ఐపీఎల్‌లో ట్రెండింగ్‌లో నోట్ సంబరాలు

మొన్న రఘు శర్మ, నిన్న ఉర్విల్ పటేల్. ఈ ఐపీఎల్?లో నోట్ సంబరాలు చేసుకొని ట్రెండింగ్?లో నిలిచిన క్రికెటర్లు వీళ్లు. తాజాగా లఖ్?నవూ సూపర్ జెయింట్స్ బౌలర్ ఆకాశ్ మహారాజ్ సింగ్ కూడా అదే ట్రెండ్ ఫాలో అవుతూ మైదానంలో అలాంటి సెలబ్రేషన్సే చేసుకొని వైరల్? అయ్యాడు. అయితే ఐపీఎల్?లో ఇలా చిటీ రాసుకొచ్చి కెమెరాకు చూపిస్తూ సెలబ్రేషన్స్ చేసుకోవడంపై సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ డెల్ స్టెయిన్ స్పందించాడు. ఐపీఎల్?లో ఈ రకమైన సెలబ్రేషన్స్?కు కాలం చెల్లిందని అభిప్రాయపడ్డాడు. తాజాగా ఎకానా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్?తో జరిగిన మ్యాచ్?లో లఖ్?నవూ సూపర్ జెయింట్స్ యువ ఆటగాడు ఆకాశ్ మహారాజ్ సింగ్ అదరగొట్టాడు. మూడు వికెట్లు తీసి చెన్నై టాపార్డర్?ను కుప్పకూల్చాడు. అతడు వరుసగా గైక్వాడ్, శాంసన్, ఉర్విల్ పటేల్?ను పెవిలియన్?కు చేర్చాడు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గొళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

## సినిమా CINEMA





# క్రమశిక్షణ కలిగిన నటుడు విజయ్: మాళవిక

కోలీవుడ్ అగ్ర కథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్‌పై నటి మాళవిక మోహనన్ ప్రశంసలు కురిపించారు. విజయ్‌తో కలిసి మాస్టర్ సినిమాలో నటించిన ఆమె ఆయనతో తనకున్న స్నేహం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ షూటింగ్‌లోనే విజయ్‌ను తొలిసారి కలిసినట్లు చెప్పారు. మాస్టర్' సినిమా మొదటిరోజు షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చింది. నా డైలాగ్స్ మీదే దృష్టిపెట్టాను. ఆయన మాత్రం ఎలాంటి కష్టమైన సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా ప్రశాంతంగా ఉంటారు. ప్రతి విషయాన్ని గమనిస్తూ పూర్తిగా పని పైనే ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడు అవసరం వచ్చినా ఫోన్ చేయగలిగే స్వేచ్ఛ ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. విజయ్ క్రమశిక్షణ తనపై ప్రభావం చూపిందని ఆమె అన్నారు. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ లాంటి సీనియర్ నటుల సినిమాల్లో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఉదయం 7 గంటలకు కాల్‌షీట్ ఉంటే 6:55కే సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు అని తెలిపారు. 'మాస్టర్' సినిమాలో విజయ్‌తో కలిసి డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని సరదాగా ఇప్పటికీ ఆయనతో చెబుతుంటానని మాళవిక నవ్వుతూ చెప్పారు.

# రవితో రిలేషన్స్ వదులుకుంటున్నా

## ట్రోల్స భరించలేక..చెన్నై వదిలి వెళుతున్నా

### గాయని కెనీషా సుదీర్ఘ పోస్ట్

తమిళ నటుడు జయం రవి (రవి మోహన్)తో రిలేషన్‌లో ఉన్నట్లు వస్తోన్న వార్తలపై కెనీషా స్పందించారు. రవితో తన రిలేషన్‌కు ముగింపు పలికినట్లు పరోక్షంగా చెప్పారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ వార్తలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని చెప్పిన ఆమె.. చెన్నై వదిలి వెళ్లిపోతున్నట్లు తెలిపారు. తనకెంతో ఇష్టమైన సంగీతాన్ని కూడా వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇన్‌స్టా ఖాతాను డిలీట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే నేను ఎన్నోసార్లు చెప్పాల్సిన దానికంటే ఎక్కువే చెప్పాను. ఈ కథలోకి నేను ఎంతో ప్రేమతో అడుగుపెట్టాను. కానీ ఇప్పుడు నిశ్శబ్దంతో వెనుదిరుగుతున్నాను. కొన్నిసార్లు ప్రపంచం మొత్తం అహంకారాలు, అవాస్తవ కథనాలతో నిండిపోతుంది. అక్కడ మంచితనానికి చోటు కూడా ఉండదు. అలాంటి పరిస్థితుల్లో ప్రేమ కూడా భారంగా మారుతుంది. ఒక మనిషిని రక్షించే ప్రయత్నంలో నేను చాలా కోల్పోయాను. కానీ నాకు ఇప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. ప్రదర్శనలకే ప్రాధాన్యమిచ్చే ఈ లోకంలో మంచితనానికి విలువ లేదని అన్నారు. అతడు ఇక పూర్తిగా మీవాడే'. దీనిపై ఇక ఎలాంటి వివరణలు ఇవ్వను. ఇకపై నేను యుద్ధాలు చేయలేను. పోరాడనూ లేను. మంచి వ్యక్తులకు జీవించడానికి ఒక అవకాశం ఇవ్వాలని అనుకోవడం, వారికి అండగా నిలబడాలని ముందుకురావడం నా అమాయకత్వం. కానీ ఈ ప్రపంచం కేవలం అబద్ధాల కోరులు, మాయగాళ్లతో నిండిపోయింది. నేను అతడిని పూర్తిగా వదులుకుంటున్నాను. అలాగే, ఇప్పటివరకూ తీసుకున్న బాధ్యతలన్నింటి నుంచి వైదొలుగుతున్నా. ఈలోకంలో త్యాగాలు చేసిన జీవితంలోని నిజాల కంటే.. భావోద్వేగాలతో అల్లిన కథలనే జనం నమ్ముతారు. మొత్తానికి మీరు కోరుకున్నదే జరిగిందని అంటూ నేను ఓడిపోయాను. చెన్నై వదిలి వెళ్లిపోతున్నాను. నా సంగీతాన్ని, నా థెరపీని, నా జీవితానికి సంబంధించిన ప్రతిదాన్ని వదిలేస్తున్నాను. తన భార్య ఆర్తి నుంచి విడిపోతున్నట్లు రవిమోహన్ 2024లో ప్రకటించారు. ఆ క్రమంలోనే.. గాయని కెనీషాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ రూమర్స్ వచ్చాయి.

# విడాకులు వచ్చే వరకు నటించను

## తనపై ట్రోల్స్ రావడంపై కన్నీటి పర్యంత అయిన జయం రవి

తాను ఎన్నో రోజులుగా సహనంతో ఉంటున్నానని.. వ్యక్తిగత విషయాల ఎక్కడా మాట్లాడలేదని నటుడు జయం రవి అన్నారు. ఇప్పుడు మాట్లాడాల్సిన సమయం వచ్చిందన్నారు. తాజా పరిణామాలపై ఆయన మీడియా ముందు మాట్లాడుతూ...తన పిల్లలకు కూడా తనని దూరం చేశారని కన్నీరు పెట్టుకున్నారు. ఇంతకాలం నా వ్యక్తిగత జీవితాన్ని మీతో పంచుకోనందుకు క్షమించండి. విడాకులు వచ్చే వరకూ నా సినిమాలు ఏవీ విడుదల కావు. అప్పటి వరకూ నేను కూడా నటించలేను. నాకు జరిగిన అవమానాలు ఇక భరించడం నా వల్ల కాదు. నన్ను ఇబ్బంది పెట్టాలని చూసేవారు ఆపేవరకూ నేను నటించలేను. ఆఫీసులోనే ఉంటాను. రండి.. ఎంతగా ఇబ్బందిపెడతారో పెట్టండి. ఇకపై నేను మౌనంగా ఉండాలని అనుకోవడం లేదు అంటూ ఎమోషన్ అయ్యారు. నాకు విడాకులు వస్తాయా.. రావా అనేది పక్కన పెడితే నాపై జరుగుతోన్న ట్రోలింగ్ నన్ను బాధిస్తోంది. నా కెరీర్‌లో 95 శాతం చిత్రాలు హిట్. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా. మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశా. అలాంటి నాపై ఎన్ని నిందలు వేస్తున్నారు. నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలని నేను లక్షలు పెట్టివాళ్లను చదివించాను. వాళ్లపై నాకున్న ప్రేమ గురించి ఎవరికీ ఏమీ తెలియదు. నాకు ప్రేమలేదని రాసేస్తున్నారు. అవి ఎంత బాధిస్తోయో మీకేం తెలుసు అని బాధపడ్డారు. కేవలం ట్రోలింగ్ కారణంగానే తన స్నేహితురాలు కెనీషాను కోల్పోయానని అన్నారు. ఆమె ఎన్నో వేధింపులు ఎదుర్కొందన్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంలో అడ్డంకులు అన్నీ తొలగిపోయిన తర్వాత కచ్చితంగా నటిస్తానని రవిమోహన్ చెప్పారు.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434